సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శనివారం । 7 । డిసెంబర్ । 2024



నిధులు తక్కువ.. ఆర్భాటం ఎక్కువ

మెగా పేరెంట్స్ కమ్ టీచర్స్ మీటింగ్‌పై సర్కారు హంగామా చేస్తోంది. అరకొర కేటాయింపులతో అధిక ప్రచారం పొందే యత్నం చేయడంతో ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు. -10లో



హోంగార్డుల సేవలు అభినందనీయం

పోలీసులతో సమానంగా విధులు నిర్వర్తిస్తూ అందరి మన్ననలు చూరగొంటున్న హోంగార్డుల సేవలు అభినందనీయమని జిల్లా అదనపు ఎస్పీ ప్రకాష్‌బాబు కొనియాడారు. -10లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.2/23.6

జిల్లాలో శుక్రవార 23.6 - 32.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 0.9 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

-కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నేడు జాబ్‌మేళా

కడప కోటిరెడ్డిసర్కిల్/ వేంపల్లె: జిల్లా ఉపాధి కార్యాలయం, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10 గంటలకు వేంపల్లెలోని వెలుగు కార్యాలయంలో ప్రముఖ కంపెనీలచే జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్ఎంఎస్ కార్పొరేట్ సర్వీస్ ప్రైవేటు లిమిటెడ్, అల్ డిక్సన్ కంపెనీలో వివిధ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులై 18–35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన వారు ఇందుకు అర్హులన్నారు. ఎంపికైన వారికి రూ. 12 వేల నుంచి రూ. 21 వేల వరకు హోదాను బట్టి వేతనం ఉంటుందన్నారు. ఆసక్తిగల నిరుద్యోగులు విద్యార్హతల ధ్రువపత్రాలు, ఫోటోలతో ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు.

నేడు వైవీయూలో జెండర్ జస్టిస్‌పై వెబినార్

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం అంతర్గత ఫిర్యాదుల కమిటీ, లైంగిక వేధింపుల నిరోధక కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో 'జెండర్ జస్టిస్ అండ్ కానిస్టిట్యూషన్ ఆఫ్ ఇండియా' పేరుతో శనివారం వెబినార్ నిర్వహించనున్నట్లు కమిటీ డైరెక్టర్ ఆచార్య ఎం. అనిత తెలిపారు. మహిళలపై హింస నిర్మూలన కోసం అంతర్జాతీయ దినోత్సవం–2024లో భాగంగా వెబినార్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ సామాజిక శాస్త్రవేత్త, న్యాయ విద్వాంసురాలు కౌన్సిల్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్ న్యూఢిల్లీ ప్రొఫెసర్ కల్పనా కన్నబిరాన్ కీలక ఉపన్యాసం చేస్తారని తెలిపారు. వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పుత్తా పద్మ, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని తెలిపారు.

కడపలో మీనాక్షి చౌదరి సందడి



షాపింగ్ మాల్ ప్రారంభం సందర్భంగా జ్యోతి వెలిగిస్తున్న సినీనటి మీనాక్షి చౌదరి

కడప కార్పొరేషన్: సినీ నటి మీనాక్షి చౌదరి కడపలో సందడి చేసింది. కడప నగరంలోని ఎర్రముక్కపల్లెలో నూతనంగా ఏర్పాటు చేసిన 'శుభమస్తు' షాపింగ్ మాల్‌ను ఆమె స్థానిక ఎమ్మెల్యే రెడ్డెప్పగారి మాధవితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మీనాక్షిని చూసేందుకు పెద్ద ఎత్తున యువత షాపింగ్ మాల్ వద్దకు తరలి వచ్చారు. ఆమెతో ఫోటోలు, సెల్ఫీలు దిగేందుకు పోటీలు పడ్డారు. ఈ సందర్భంగా మీనాక్షి చౌదరి మాట్లాడుతూ 'శుభమస్తు' షాపింగ్ మాల్ 7వ షోరూం తన చేతుల మీదుగా ప్రారంభం కావడం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు ఆర్. శ్రీనివాసులరెడ్డి, షోరూం మేనేజింగ్ డైరెక్టర్లు బయ్యా శ్రీనివాసులు, బయ్యా రవి కుమార్, శ్రీనివాస రాణా ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు

కడప అగ్రికల్చర్: ఉద్యానశాఖలో 2024–25వ ఆర్థిక సంవత్సరానికి ఉద్యాన సమగ్రాభివృద్ధి పథకం కింద రూ. 18.13 కోట్ల నిధులు జిల్లాకు మంజూరైనట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి సుభాషిణి తెలిపారు. ఈ నిధులతో జిల్లాలో ఇంటిగ్రేటెడ్ ప్యాక్ హౌస్, కోల్డ్ స్టోరేజీ, కోల్డ్ రూమ్స్, ఉల్లి నిల్వ గోదాములు, కలెక్షన్ సెంటర్స్‌ను ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఇందులో ఒక్కొ దానికి 35 శాతం నుంచి 40 శాతం రాయితీ వరకు సబ్సిడీ వస్తుందని తెలిపారు.

వైఎస్ఆర్ ఏఎఫ్‌యూలో నూతన కమిటీలు ఏర్పాటు

ఏఎఫ్‌యూ: కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో పలు విభాగాలకు నూతన కమిటీలను ఏర్పాటు చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. 39 కమిటీలను ఏర్పాటు చేశారు. విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథకుమార్ ఆదేశాల మేరకు నూతన కమిటీలకు కోఆర్డినేటర్లను, సభ్యులను నియమిస్తూ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఎన్. రాజేష్‌కుమార్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. కాలేజ్ డెవలప్‌మెంట్ కమిటీ (సీడీసీ) చైర్మన్‌గా విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథకుమార్ వ్యవహరించనుండగా, సీడీసీ డీన్‌గా కె. శాంతిని నియమించారు. యాంటీ ర్యాగింగ్ కమిటీ నోడల్ ఆఫీసర్‌గా రిజిస్ట్రార్ ఎన్. రాజేష్‌కుమార్‌రెడ్డి, పీఆర్‌ఓగా వి. శివకృష్ణారెడ్డిని, స్పోర్ట్స్ కోఆర్డినేటర్‌గా డా. టి.ఎన్. ప్రసాద్‌రెడ్డిని, లైబ్రరీ కమిటీ కోఆర్డినేటర్‌గా డా. భూతపురి సురేంద్రశర్మను, కల్చరల్ కోఆర్డినేటర్‌గా, వై. మనోహర్‌రావును, అకడమిక్ రెగ్యులేషన్స్ కోఆర్డినేటర్‌గా డా. జి. ఫణీంద్రారెడ్డిలను నియమించారు. వీటితో పాటు పలు విభాగాలకు సంబంధించిన కమిటీలను ఏర్పాటు చేశారు.

చదువుల కోవెల.. సమస్యలతో వెలవెల

కడప మున్సిపల్ హైస్కూల్ (మెయిన్)కు ఘన చరిత్ర ఉంది. అయితే ఈ పాఠశాలను కొన్ని సమస్యలు పట్టి పీడిస్తున్నాయి. గతంలో వృత్తి విద్యాకోర్సులు పూర్తి స్థాయిలో అందేవి. ఈ కోర్సులలో తర్ఫీదు పొందిన విద్యార్థులు చక్కటి ఉపాధి పొందేవారు. నేడు ఆ పరిస్థితి లేదు. ఉపాధ్యాయులకు మరుగుదొడ్ల వసతి అంతంత మాత్రమే. ఇక విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్ పనిచేయడం లేదు. ఇక పాఠశాల అభివృద్ధికి పూర్తి కావాల్సిన పనులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటన్నింటిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది. నేడు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈ పాఠశాలలో నిర్వహించనున్న మెగా పేరెంట్స్– టీచర్స్ మీట్‌కు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ఆయన ఈ సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

- కడప మున్సిపల్ హైస్కూల్‌లో నేడు మెగా పేరెంట్స్– టీచర్స్ మీట్
- హాజరుకానున్న డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్



కడప మున్సిపల్ హైస్కూల్ (మెయిన్)

సాక్షి ప్రతినిధి, కడప: కడప నగరంలో ఏర్పాటైన మున్సిపల్ హైస్కూల్ (మెయిన్)కు 167 ఏళ్ల ఘనమైన చరిత్ర ఉంది. నాటి బ్రిటిష్ ప్రభుత్వం పరిపాలన సౌలభ్యం కోసం నెలకొల్పిన పాఠశాల ఇది. ఎంతోమందిని సమాజానికి ఉన్నతాధికారులుగా, రాజకీయ నాయకులుగా పరిచయం చేసింది. పలువురు ఎమ్మెల్యేలు, మంత్రులు సైతం ఇక్కడ చదువుకున్న విద్యార్థులే. అలాంటి పాఠశాలలో నేడు కొన్ని సమస్యలు తిష్ట వేశాయి.

వైఎస్ఆర్, వైఎస్ జగన్ చేయూత..

ఈ పాఠశాలకు గతంలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన వైఎస్ రాజశేఖరరెడ్డి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు చేయూతనందించారు. నిధులు భారీగా విడుదల చేసి విద్యాభివృద్ధికి విశేష కృషి చేశారు. ఈ పాఠశాల ఉన్నతికి వైఎస్ఆర్ చేయూత నివ్వగా, తర్వాత నగర పాలక సంస్థ ఉడుతా భక్తి చాటుకుంది. ఆ తర్వాత మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్ రూ.3.58 కోట్లు నిధులు కేటాయించడంతో ఆ బడి రూపురేఖలు మారాయి.

150 వ వసంతాల ఉత్సవాలు..

2007వ సంవత్సరానికి 150 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 'సెస్క్వి సెంటినరీ సెలబ్రేషన్స్' నిర్వహించగా ఆనాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అప్పటి పరిస్థితుల్లో మెరుగైన వసతుల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించి తోడ్పాటు ఇచ్చారు. తర్వాత కాలంలో ఏర్పాటైన నగర పాలక సంస్థ ఉన్నత పాఠశాలకు ప్రోత్సాహం ఇచ్చింది. 2016 నుంచి టీచర్ల కొరత లేకుండా కార్పొరేషన్ నిధులతో ప్రస్తుత, ఆనాటి మేయర్ సురేష్‌బాబు 110 మంది విద్యా వాలంటీర్లను నగరంలో నియమించారు. ఒక్కొక్కరికి రూ.8వేలు చొప్పున నెలనెలా సీఎస్ఆర్ గ్రాంటులో వెచ్చిస్తోంది. ఇప్పుడు ఆ జీతం రూ.11 వేలు చెల్లిస్తున్నారు. ఆపై తొట్టతొలుత 2015లోనే మేయర్ సురేష్‌బాబు ఇంగ్లీషు మీడియం ప్రవేశపెట్టారు. విద్యార్థులందరికీ ఉచితంగా యూనిఫాం అందించారు. అలా ప్రోత్సాహం అందుకున్న నగరపాలక హైస్కూల్ నాడు–నేడు పథకంలో భాగంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కార్‌లో రెండు విడతల్లో రూ.3.58 కోట్లు నిధులు వెచ్చించారు. 20 అదనపు తరగతి గదులు, ఆధునీకరణ పనులు చేపట్టారు. 2007వ సంవత్సరంలో పాఠశాలలో 768 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తుండగా తాజాగా 1,470 మంది విద్యార్థులున్నారు.

ప్రముఖులంతా ఇక్కడి విద్యార్థులే...

మాజీ కేంద్ర మంత్రి ఏ. సాయిప్రతాప్, మాజీ మంత్రులు దివంగత ఖలీల్‌బాషా, హాజీ ఎస్ఎండీ అహమదుల్లా, మాజీ ఎమ్మెల్యే దివంగత కందుల శివానందరెడ్డి ఒకప్పటి ఈ పాఠశాల విద్యార్థులే. మాజీ ఐఏఎస్ ప్రభాకరరెడ్డి లాంటి ఎందరో ఉన్నతాధికారులు ఇక్కడ విద్యనభ్యసించినవారే. ఇలా చెప్పుకుంటూ పోతే, వందల మంది వైద్యులు, ఇంజనీర్లు, అధ్యాపకులు ఇదే పాఠశాల నుంచి వచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లో స్థిరపడిన వారు సైతం ఉన్నారు.

డిప్యూటీ సీఎంపై గురుతర బాధ్యత..

రాష్ట్ర ప్రభుత్వం శనివారం కడపలోని మున్సిపల్ హైస్కూల్‌లో మెగా పేరెంట్స్ – టీచర్స్ మీట్ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పాల్గొననున్నారు. విద్యార్థులు, పేరెంట్స్‌తో ముఖాముఖీ కార్యక్రమం చేపట్టనున్నారు. అయితే చరిత్ర కల్గిన ఈ పాఠశాలలో మునుపు వృత్తి విద్యా కోర్సులు ఉండేవి. ఈ కోర్సులు నేర్చుకున్న విద్యార్థులు ఆ తర్వాత ఉపాధి పొందేవారు. నేడు ఆ పరిస్థితిలేదు. వృత్తి విద్యా కోర్సు నేర్పేందుకు 5 మంది ఉపాధ్యాయులు ఉండాల్సి ఉండగా కేవలం ఒకరే ఉన్నారు. దీంతో పూర్తి స్థాయిలో వృత్తి విద్య అందడం లేదు. వృత్తి విద్యలోని పలు విభాగాలు అటకెక్కాయి. అలాగే పెండింగ్‌లో ఉన్న పాఠశాల పనులు పూర్తి చేసేందుకు సహకారం అందించాల్సిన అవసరం ఉంది. చరిత్ర కల్గిన ఈ పాఠశాలను ఇంటర్మీడియట్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాల్సిన అవసరం కూడా ఉంది. ఆ దిశగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు. ఇంకా సమావేశం నేపథ్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు చెప్పే సమస్యలపై దృష్టి సారించి పరిష్కరించాలని విద్యావేత్తలు కోరుతున్నారు.

ఇదీ చరిత్ర..

1857వ సంవత్సరంలో ప్రస్తుత నగర పాలక హైస్కూల్ స్థాపించారు. మొదట్లో ఈ పాఠశాలను డిస్ట్రిక్ బోర్డ్ హైస్కూల్‌గా పిలిచేవారు. 1888లో కడప పురపాలక పాఠశాలగా చేర్చారు. భారతదేశంలో బ్రిటిష్ వారి పరిపాలన సౌలభ్యం కోసం, విద్యాభివృద్ధి కోసం నెలకొల్పిన ఘన చరిత్ర కలిగిన పాఠశాల ఇదే. అప్పట్లో జిల్లా కలెక్టర్ సెలవుపై ఉంటే ఆయన అధికారాలను ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయులైన ఇలియట్‌కు బదలాయించేవారు. ఇలియట్ ప్రముఖ యూరోపియన్ విద్యావేత్త. కాగా ఇక్కడి పాఠశాల మొదటి ప్రధానోపాధ్యాయులు. ఈ పాఠశాల తొలి భారతీయ ప్రధానోపాధ్యాయులుగా హరి సర్వోత్తమరావు విధులు నిర్వహించారు.

సమన్వయంతో పనిచేయండి

- మెగా పేరెంట్స్ – టీచర్స్ సమావేశ నిర్వహణపై జేసీ దిశానిర్దేశం



మున్సిపల్ హైస్కూల్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ అదితిసింగ్

కడప ఎడ్యుకేషన్: మెగా పేరెంట్స్ – టీచర్స్ సమావేశ కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ పేర్కొన్నారు. కడప మున్సిపల్ హైస్కూలు (మెయిన్)లో శనివారం నిర్వహించనున్న మెగా పేరెంట్స్ – టీచర్స్ మీట్ కార్యక్రమంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆ పాఠశాలను జేసీ సందర్శించారు. ఏర్పాట్లు, నిర్వహణపై అధికారులతో కలిసి పర్యవేక్షించారు. తొలుత పాఠశాలలోని అన్ని తరగతి గదులను, సభా ప్రాంగణం, సభా వేదిక ఏర్పాటు తదితర వివరాలను సంబంధిత అధికారులను అడిగి తెలుసుకుని తగు సూచనలు, ఆదేశాలను జారీ చేస్తూ వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. మధ్యాహ్న భోజన ఏర్పాట్లపై ఆరా తీశారు. మధ్యాహ్నం సహపంక్తి భోజన ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థినీ విద్యార్థులతో మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా అధిక సంఖ్యలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు రానున్న నేపథ్యంలో తాగునీటి వసతి, షామియాన, టెంట్లు, కుర్చీలు, మైక్ సిస్టం తదితర ఏర్పాట్లు పక్కాగా ఉండాలని సూచించారు. ప్రొటోకాల్ ప్రకారం అందరికీ ఆహ్వానం పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్డీఓ జాన్ ఇర్విన్, మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, డీఈఓ మీనాక్షి, జిల్లా ఉపాధి కల్పన అధికారి సురేష్, సోషల్ వెల్ఫేర్ డీడీ సరస్వతి, డీఆర్‌డీఏ పీడీ ఆనంద్ నాయక్, డీఎం–హెచ్ఓ నాగరాజు, సమాచార శాఖ ఏడీ వేణుగోపాల్ రెడ్డి, డీఈఓ మీనాక్షి, స్కూల్ హెచ్.ఎం. నాగమణి, మున్సిపల్ హెల్త్ ఆఫీసరు చంద్రోఖర్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

అదివో.. అల్లదివో..



కడప–రేణిగుంట జాతీయరహదారిలోని బోయనపల్లెలో ఆకేపాటిని గజమాలతో సత్కరిస్తున్న నేతలు



ఆకేపాటి అమరనాథరెడ్డి పాదయాత్రలో బద్వేలు ఎమ్మెల్యే దాక్టర్ సుధ

- ఆకేపాటి తిరుమల మహాపాదయాత్ర
- మారుమోగిన గోవిందనామస్మరణలు

రాజంపేట: పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు నడిచిన కాలిబాటలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజంపేట శాసనసభ్యుడు ఆకేపాటి అమరనాథరెడ్డి 22వ సారి తిరుమల పాదయాత్రను శుక్రవారం చేపట్టారు. అంతకముందుగా శ్రీవారి కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఇందులో మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు పాల్గొన్నారు. అనంతరం ఆకేపాడు ఆలయాల సముదాయాల నుంచి బయలుదేరిన పాదయాత్ర ఆకేపాడు క్రాస్, ఎర్రబల్లి, అన్నమాచార్యయూనవర్సిటీ సర్కిల్, తాళ్లపాక ఆర్చి, మన్నూరు ఎల్లమగుడి, ఆర్టీసీ బస్టాండు, మార్కెట్ ఏరియా, శివాలయం క్రాస్, పాతబస్టాండు, తిరుపతి రోడ్డులోని ఎస్ఆర్ కళ్యాణమండపం వరకు కొనసాగింది. ఈ పాదయాత్రలో బద్వేలు ఎమ్మెల్యే సుధారాణి, ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, జడ్పీవైస్‌చైర్మన్ బాలయ్య,కడప డిప్యూటీమేయర్ నిత్యానందరెడ్డి, మాజీ వైస్‌చైర్మన్ ఇరంగొరెడ్డి సుబ్బారెడ్డి, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు మాసీమబాబు, ఆర్టీసీ రీజనల్ మాజీ చైర్మన్ రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, మదనపల్లె ఇన్‌చార్జి నిస్సార్, రాజంపేట మున్సిపాలిటీ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డి, మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ పీసీ యోగీశ్వరరెడ్డి, ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, వీరబల్లిఎంపీపీ రాజేంద్రనాథరెడ్డి,మున్సిపాలిటీ వైస్‌చైర్మన్ మర్రిరవి, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కృష్ణారావుయాదవ్ ,బీసీజిల్లానేత ఈశ్వరయ్య, నేతలు భాస్కర్‌రాజు, జీవీసుబ్బారెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండుగోపి, మహిళానేత మిరయాలసు రేఖ, కోలాకొండయ్య, పసుపులేటి మనోజ్,వెంకట్రాజు, ముస్లింమైనార్టీనేతలు, ఆర్యవైశ్య, బీసీవర్గాలకు నాయకులు పాల్గొన్నారు.

అడుగడుగునా ఘనస్వాగతాలు..

నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నేత ఆకేపాటి అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆకేపాటి పాదయాత్ర రాజంపేట పట్టణంలో చేరుకోగానే మున్సిపాలిటీ చైర్మన్ పోలా శ్రీనువాసులరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతంపలికారు. అన్ని వర్గాలకు చెందిన నాయకులు గజమాలతో సత్కరించారు.

ఘనంగా శ్రీదేవి, భూదేవిలతో శ్రీ వెంకటేశ్వరస్వామి ఊరేగింపు

తిరుమల మహాపాదయాత్రలో ప్రధానంగా ప్రత్యేకరథంపై శ్రీదేవి, భూదేవిలతో శ్రీ వెంకటేశ్వరస్వామి ఊరేగింపు కొనసాగింది. కోలాటాలు, భజనలు యాత్రలో నిరంతరం కొనసాగాయి. పదకవితాపితామహుడు తాళ్లపాక అన్నమాచార్యులు కీర్తనలు భక్తి భావాన్ని పెంపొందించాయి. రాజంపేట వాసులు దారులన్నీ ఆకేపాటి పాదయాత్ర వైపు కదిలాయి.

దార్శనికుడు బీఆర్ అంబేడ్కర్



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాష

కడప కార్పొరేషన్: భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ గొప్ప దార్శనికుడని కడప మేయర్ కె. సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బి అంజద్‌బాషా సంయుక్తంగా పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం స్థానిక ఆర్టీసీ బస్టాండు కూడలిలోని ఆయన విగ్రహానికి వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో వారు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విగ్రహం ఎదుట నిలబడి జై భీమ్, జోహార్ డా. బీఆర్ అంబేడ్కర్ అంటూ నినాదాలు చేశారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం వల్లే దేశంలో అన్ని కులాలు, మతాల ప్రజలు ఐక్యంగా ఉంటున్నారన్నారు. దివంగత వైఎస్సార్ అంబేడ్కర్‌ను ఆదర్శంగా తీసుకొని జనరంజకంగా పాలన అందించారని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అంబేడ్కర్ ఆశయాల సాధనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 శాతం పదవులు ఇచ్చారని తెలిపారు. దేశాన్ని ప్రపంచంలో మేటిగా నిలబెట్టేందుకు భారతీయులంతా ఐక్యతతో మెలగాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో....

కడప నగరంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో డా. బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమానికి మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పులి సునీల్, బంగారు నాగయ్య, దాసరి శివ, తోటక్రిష్ణ, వేణుగోపాల్ నాయక్, కరిముల్లా, కార్పొరేటర్లు మల్లికార్జున, రామలక్ష్మణ్ రెడ్డి, షఫీ, నాగేంద్ర, షంషీర్, ఎస్సీసెల్ నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు, మహిళా నేతలు టీపీ వెంకట సుబ్బమ్మ, ఉమామహేశ్వరి, రత్నకుమారి, సుశీలమ్మ పాల్గొన్నారు.

సెల్యూట్.. సైనికా!

మాతృభూమి కన్నతల్లితో సమానం.. భూమాత ఒడిలో ప్రజలందరూ ఎల్లవేళలా క్షేమంగా ఉండాలని దేశ సరిహద్దుల్లో నిరంతరం పహారా కాస్తున్నారు భారత సైనికులు. భరతమాత సేవకు జీవితం అంకితం చేస్తున్నారు. బంధుత్వాలు, కుటుంబసభ్యులకు దూరంగా ఉంటూ దేశరక్షణే లక్ష్యంగా తమ ప్రాణాలను సైతం పణంగా పెడుతున్న సైనికులంటే మనదేశంలో ప్రత్యేక గౌరవం ఉంది. ఇప్పుడు అటువంటి సైనికుల పట్ల మనకు ఉన్న గౌరవాన్ని సైనికుల కుటుంబాలకు మేమున్నామంటూ తమవంతు చేయూతనిచ్చే అవకాశం వచ్చింది.. డిసెంబర్ 7వ తేదీని ఫ్లాగ్ డే పేరుతో సాయుధ దళాల దినోత్సవంగా నిర్వహించుకుంటాం.

నేడు సాయుధ దళాల పతాక దినోత్సవం



కడప స్పోర్ట్స్: దేశం కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరుల కుటుంబాలకు, యుద్ధసమయంలో అవయవాలను కోల్పోయిన వీరసైనికులకు బాసటగా నిలిచేందుకు సాయుధదళాల వారోత్సవాలు ఏర్పాటయ్యాయి. 1949 డిసెంబర్ 7న త్రివిధ సాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహించడం ప్రారంభించారు. అయితే 1993లో ఆర్మ్‌డ్ ఫోర్సెస్ ఫ్లాగ్ డే ఫండ్ పేరుతో నిధిని ఏర్పాటు చేశారు. దేశ రక్షణ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. అప్పటి నుంచి ప్రతి యేటా డిసెంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు సాయుధ దళాల వారోత్సవాలు నిర్వహించి 7వ తేదీన ఫ్లాగ్‌డేగా ప్రజల నుంచి విరాళాలు సేకరిస్తారు. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ రంగాలకు చెందిన సైనికులు, వారి కుటుంబీకులు, వితంతువులకు చేయూతనిచ్చేందుకు విరాళాలను సేకరిస్తారు. విరాళాల ద్వారా వచ్చిన సొమ్మును అధికారుల ద్వారా వైకల్యం పొందిన మాజీ సైనికులు/వారి కుటుంబ సభ్యులు, వితంతువులకు అందజేస్తారు.


దేశసైన్యంలో జిల్లాలో ప్రాతినిధ్యం

దేశసైన్యంలో వైఎస్ఆర్ జిల్లాకు ప్రత్యేకస్థానం ఉంది. ఇప్పటికే వేల సంఖ్యలో సైన్యంలో జిల్లా వాసులు పనిచేయడం మన జిల్లాకు దక్కిన గౌరవం. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా త్రివిధ దళాల్లో 5014 మంది మాజీ సైనికులు పనిచేసి ఉన్నారు. వీరిలో ఆర్మీలో 4636, ఎయిర్‌ఫోర్స్‌లో 297 మంది, నేవీలో 81 మంది ఉన్నారు. వీరితో పాటు సైన్యంలో కుటుంబసభ్యులను కోల్పోయిన వితంతువులు ఆర్మీలో 1092 మంది ఉన్నారు. అయితే వీరందరికి ప్రభుత్వ పరంగా పలు ప్రయోజనాలు లభిస్తున్నప్పటికీ వారి సేవలకు ఎంతచేసినా తక్కువే అన్న భావనతో పౌరులు స్పందించి తోచిన సాయం చేసి సైనికులకు వారి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించే యత్నమిది.



విరాళాలు సేకరిస్తున్న ఎన్‌సీసీ కేడెట్స్ (ఫైల్)

సైనికుల త్యాగనిరతిని స్మరించుకుందాం..



దేశం కోసం ప్రాణాలు పణంగా పెట్టిన వీరసైనికులను, వారి కుటుంబసభ్యుల త్యాగనిరతిని స్మరించుకునేందుకు త్రివిధ సాయుధ దళాల పతాక దినోత్సవం నిర్వహిస్తున్నాం. ప్రజలు విరివిగా విరాళాలు ఇచ్చి భారత సైన్యంలో మాతృభూమికి విశేష సేవలు అందించిన వీరజవాన్ల కుటుంబాలకు బాసటగా నిలవాలి.

– డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, జిల్లా కలెక్టర్

పతాక దినోత్సవం విశిష్టత



దేశం కోసం తమ జీవితాలను త్యాగం చేసిన వీర జవాన్‌లను, త్రివిధ దళాలలో ఉంటూ దేశ సరిహద్దులను కాపాడటంలో నిరంతరం సేవలందించే సైనికులను గుర్తుచేసుకుంటూ వారి కుటుంబ సభ్యుల త్యాగనిరతిని స్మరించుకునే రోజే త్రివిధ సాయుధ దళాల పతాక దినోత్సవం. ఆ రోజు విద్యార్థులు, ఎన్‌సీసీ కేడెట్స్ ప్రజలకు పతాకాన్ని అందించి హుండీ ద్వారా విరాళాలు స్వీకరిస్తారు. దీంతో పాటు ఆన్‌లైన్ ద్వారా కూడా విరాళాలను పంపవచ్చు.

- ప్రజలు ఎవరైనా మాజీ సైనికులకు చేయూతనివ్వదలచిన వారు కడప నగరంలోని జిల్లా సైనిక సంక్షేమ కార్యాలయం, ఆర్‌టీసీ బస్టాండు ఎదురుగా, స్పెన్సర్ వెనుకభాగాన, కడపలో అందజేసి రశీదు పొందవచ్చు. అదే విధంగా డీడీ రూపంలో కానీ, ఈసీఎస్ ద్వారా కానీ స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎంజీ రోడ్, విజయవాడ, అకౌంట్ నెంబర్ 33881128795, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ ఎస్‌బీఐఎన్0016857కు పంపవచ్చు. విరాళలు ఇచ్చేవారికి సెక్షన్ 80 జి ఆదాయపు పన్ను చట్టం కింద పన్ను నుంచి మినహాయింపు కలదు.

క్లుప్తంగా

నేడు వైఎస్ జార్జిరెడ్డి వర్ధంతి



పులివెందుల రూరల్ : దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సోదరుడు దివంగత వైఎస్ జార్జిరెడ్డి 25వ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించనున్నారు. పులివెందులలోని వైఎస్సార్ ఫ్యామిలీ సమాధుల తోటలో వైఎస్ జార్జిరెడ్డి ఘాట్ వద్ద జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మతోపాటు కుటుంబ సభ్యులు నివాళులర్పించనున్నారు. వైఎస్ రాజారెడ్డికి ఐదుగురు కుమారులు ఉండగా, ప్రథమ పుత్రుడు జార్జిరెడ్డి. శనివారం భాకరాపురంలో వైఎస్ జార్జిరెడ్డి ఐటీఐ కళాశాలలో వైఎస్ భారతమ్మ.. విద్యార్థులు, అనాథలకు దుస్తులు పంపిణీ చేయనున్నారు. అనంతరం జీసెస్ చారిటీస్‌లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు.

పట్టపగలే చోరీ



దొంగతనం జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న పోలీస్ అధికారులు

అట్లూరు : మండల పరిధి అట్లూరు క్రాస్ రోడ్డులోని ఎగువపల్లె కాలనీలో పట్టపగలే చోరీ జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఎగువపల్లె కాలనీలో చల్లా లక్షుమ్మ, పాలకొండయ్య దంపతులు శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో కాలనీలోని తెలిసిన వారి ఇంటికి వెళ్లారు. ఈ విషయాన్ని గమనించిన దుండగులు లక్షుమ్మ ఇంట్లో ఉన్న 48 గ్రాముల బంగారు నగలు దొంగలించారు. ఇంటికి వచ్చి చూసే సరికి వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బంగారాన్ని వెతకగా కనిపించకపోవడంతో స్థానిక ఎస్ఐ రామకృష్ణకు లక్షుమ్మ, పాలకొండయ్య కుమారుడు కొండయ్య ఫిర్యాదు చేశారు. వెంటనే రూరల్ సీఐ నాగభూషణంతోపాటు గోపవరం ఎస్ఐ శ్రీకాంత్, స్థానిక ఎస్ఐ రామకృష్ణ సంఘటన స్థలానికి చేరుకుని బాధితులతో వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి వారు దర్యాప్తు చేపట్టారు.

ఆలయంలో దొంగల చేతివాటం

కమలాపురం : పట్టణ పరిధిలోని శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో చోరీ జరిగిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆలయ కమిటీ చైర్మన్ సుబ్బారెడ్డి సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. గురువారం ఆలయ ఆవరణలో ఓ వైపు అయ్యప్ప, శివమాల ధారణ భక్తులకు భోజనాలు వండే పనిలో వంట మనిషి ఇతర సిబ్బంది ఉన్నారు. మరో వైపు గురువారం కావడంతో భక్తులు వచ్చి పూజలు చేసి వెళ్లిపోయారు. ఆలయంలో ఎవరూ లేరని గమనించిన గుర్తు తెలియని దుండగులు లోపలికి వెళ్లి స్వామి వారి వద్ద వెండి పల్లం, రెండు పావుకోళ్లను అపహరించుకు వెళ్లారు. దాదాపు 2 కిలోలు ఉంటాయని, వాటి విలువ రూ.2 లక్షల వరకు ఉంటుందని ఆలయ చైర్మన్ తెలిపారు. పోలీసులకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశామని ఆయన పేర్కొన్నారు.

నిధులు తక్కువ.. ఆర్భాటం ఎక్కువ

- మెగా పేరెంట్స్ కమ్ టీచర్స్ మీటింగ్‌పై సర్కారు హంగామా
- అరకొర కేటాయింపులతో అధిక ప్రచారం పొందే యత్నం
- 'తల'పట్టుకుంటున్న ఉపాధ్యాయులు
- నేడు జిల్లా వ్యాప్తంగా పాఠశాలల్లో సమావేశాలు



మండల వనరుల కేంద్రంలో సమావేశంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు(ఫైల్)

కడప ఎడ్యుకేషన్ : తక్కువ పెట్టుబడి పెట్టి ఎక్కువ ప్రయోజనం పొందే ప్రయత్నం చేయడం సీఎం చంద్రబాబు నాయుడుకు ముందు నుంచి ఉన్న అలవాటే. అయితే చివరికి చిన్నారులకు పాఠాలు బోధించే అయ్యవార్లను సైతం వదలకపోవడం అందరినీ విస్తుపోయేలా చేస్తోంది. శనివారం మెగా పేరెంట్స్ మీటింగ్‌ను అట్టహాసంగా నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం ఉపాధ్యాయులంతా అహర్నిశలు శ్రమిస్తున్నారు. 10 రోజులుగా వీరు ఈ కార్యక్రమం పైనే దృష్టి సారించడంతో.. విద్యార్థులకు పాఠాల బోధన సరిగా జరగలేదనే చర్చ జరుగుతోంది. కార్యక్రమం విజయవంతం కోసం విద్యాశాఖ ఉన్నతాధికారులు నిర్వహించే వెబ్ మీటింగ్‌ల నిమిత్తం రెండు రోజులకోసారి మండల వనరుల కేంద్రంలో సమావేశమవుతూ.. బడులకు దూరమవుతున్న ఉపాధ్యాయులు సైతం విసిగిపోతున్నట్లు తెలిసింది.

కేవలం రూ.39.19 లక్షలు కేటాయించి..

జిల్లా వ్యాప్తంగా 36 మండలాల పరిధిలో 2043 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో 1,39,669 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ సమావేశాల నిర్వహణ కోసం జిల్లాకు రూ. 39,19,200 కేటాయించారు. ఈ నిధులతో అన్ని పాఠశాలల్లో ఈ నెల 7న అట్టహాసంగా మెగా పేరెంట్స్ కమ్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం)ను నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. 100 మందిలోపు విద్యార్థులున్న పాఠశాలకు 1000 రూపాయలు, 300 మంది విద్యార్థులున్న ఉన్నత పాఠశాలకు రూ.4000 మాత్రమే కేటాయించింది. ఈ నిధులతోనే సదరు ప్రధానోపాధ్యాయుడు హంగు ఆర్భాటాలతో తల్లిదండ్రులకు స్వాగతం పలికి, వారికి ఆటల పోటీలు ఏర్పాటు చేసి, అందులో గెలిచిన వారికి బహుమతులు అందజేసి, వచ్చిన వారందరినీ కుర్చీలపై ఆశీనులను చేసి, మధ్యాహ్నం ప్రతి ఒక్కరికీ మంచి భోజనం (శుభదిన్ భోజన్) పెట్టించి సమావేశాన్ని ఆహా ఓహో అనిపించాలన్నది అధికారుల సందేశం. అంటే ఒక పేరెంటుకు సగటున 13 రూపాయలు వంతున ప్రధానోపాధ్యాయుడి చేతిలో పెట్టి.. ఈ డబ్బుతోనే కార్యక్రమాన్నంతా నడిపించాలంటూ హుకుం జారీ చేయడం చూస్తోంటే.. ప్రభుత్వ ప్రచార యావ ఏ స్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు.

నలిగిపోతున్న అయ్యవార్లు

ఈ మెగా సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు ప్రజాప్రతినిధులను కూడా ఆహ్వానించాల్సి ఉంది. వీరందరికీ ఉపాధ్యాయులే స్వయంగా ఆహ్వాన పత్రికలు అందజేయాలట. పాఠశాల ప్రాంగణాన్ని అంగరంగ వైభవంగా తీర్చిదిద్ది, తరగతి గదులను అందంగా అలంకరించాలట. విద్యార్థులకు హోలిస్టిక్ కార్డులు తయారు చేయడంతోపాటు వారిని సాంస్కృతిక కార్యక్రమాలకు సిద్ధం చేయాలి. పాఠశాల ఫొటోతో పెద్ద బ్యానర్ చేయించి, మీటింగ్‌పై ప్రజలందరికీ అవగాహన కల్పించాలి. ఈ పనుల్లో గత 10 రోజులుగా రాష్ట్రంలోని ఉపాధ్యాయులందరూ సతమతమవుతున్నారు. ప్రధానోపాధ్యాయులకైతే గత వారం రోజుల్లోనే ఎమ్మార్సీలో 3 సమావేశాలు ఏర్పాటు చేసి వారిపై ఒత్తిడి పెంచుతున్నారు. ఈ విషయంలో సింగిల్ టీచర్లను కూడా వదలడం లేదు. విచిత్రమేమిటంటే మెగా పేరెంట్స్ సమావేశం జరిగే శనివారం రోజున ఏ ఒక్క ఉపాధ్యాయుడికి కూడా సెలవు మంజూరు చేయొద్దంటూ అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారట. మీకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఆరోజు సెలవు ఇవ్వబోము అని అధికారులు చెబుతుండటంతో.. అయ్యవార్లు మరింత ఒత్తిడికి లోనవుతున్నారు.

తల్లికి వందనం డబ్బులు ఇవ్వరా...

'ఈ నెల ఏడో తేదీన ప్రభుత్వ ఆదేశాల మేరకు మన పాఠశాలలో మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ నిర్వహిస్తున్నాం. ఆ రోజు మీరు తప్పక రావాలన్నా' అంటూ ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులను ఆహ్వానించినప్పుడు.. వారు పలు ప్రశ్నలను సంధిస్తున్నారు. నూతన ప్రభుత్వం తమ పిల్లలకు ఇవ్వాల్సినవి ఇవ్వకపోగా.. ఈ ఆర్భాటాలు అవసరమా అంటూ ప్రశ్నిస్తున్నట్లు తెలిసింది. ఎంత మంది పిల్లలుంటే అంత మందికి 15 వేల రూపాయల చొప్పున తల్లికి వందనం డబ్బులు తల్లి అకౌంట్లో వేస్తామని చెప్పిన చంద్రబాబు.. ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదని వారు ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. గత ఆరు నెలల్లో ప్రభుత్వం విద్యాశాఖకు ఏం చేసిందని ఇప్పుడు మెగా సమావేశం నిర్వహిస్తున్నారని ప్రశ్నించడంతోపాటు నాడు–నేడు పనులను ఆపివేసినందుకా ఈ సమావేశాలు అంటూ నిలదీస్తున్నట్లు తెలిసింది. 'ఇప్పుడు అందరికీ పనుల కాలం.. వ్యవసాయ పనులు, కూలీ పనులకు వెళ్లే మేము ఆ రోజు పనులను వదిలిపెట్టి పాఠశాలకు వస్తే కూలి డబ్బులు మీరిస్తారా?' అంటూ సూటిగా ప్రశ్నిస్తున్నట్లు సమాచారం. కనీసం మధ్యాహ్నమైనా రుచికరమైన భోజనం పెడదామని భావిస్తే.. విద్యార్థులకు రోజూ పెట్టే భోజనమే తల్లిదండ్రులకు కూడా పెట్టాలని అధికారులు చెప్పడంతో.. ఆ రోజు సమావేశానికి హాజరైన వారు ఎంత రభస చేస్తారోనని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నట్లు తెలిసింది. ఆహ్వానిస్తేనే ఇన్ని ప్రశ్నలు వేస్తున్న తల్లిదండ్రులు.. సమావేశంలో మరెన్ని ప్రశ్నలు వేస్తారోనని అయ్యవార్లు తల పట్టుకుంటున్నట్లు సమాచారం.

నిధులు పెంచాలి



పేరెంట్స్ కమిటీ సమావేశానికి పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు కేటాయించారు. ఈ నిధులు సమావేశానికి కనీస వసతుల కల్పనకు కూడా సరిపోవు. దీంతోపాటు పలు కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించింది. వాటన్నింటినీ నిర్వహించాలంటే నిధులు ఏమాత్రం చాలవు.

– లెక్కల జమాల్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు, ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయుల సంఘం

తల్లిదండ్రులకు పరిమితం చేస్తే మేలు



పేరెంట్స్ కమిటీ మీటింగ్ నిర్వహణను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు మాత్రమే పరిమితం చేయాలి. మీటింగ్ నిర్వహణకు నిధులు సరిపడ ఇవ్వలేదు. దీంతోపాటు పేరెంట్స్‌కు ముగ్గుల పోటీల నిర్వహణతోపాటు పలు కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. వీటి నిర్వహణకు తగినంత నిధులను విడుదల చేయాలి.

– సీవీ ప్రసాద్, రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీటీఎఫ్ అమరావతి

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు



నిందితుడు షేక్ షాలు

కడప అర్బన్ : హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదుతోపాటు జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి శుక్రవారం తీర్పు వెలువరించారు. వివరాలు ఇలా ఉన్నాయి. కడప నగరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పక్కన సులభ్‌కాంప్లెక్స్ సమీపంలో 2020 మే 31న రాయల్‌హోల్ వీధికి చెందిన షేక్ ఖాదర్‌వలీ(24)ని షేక్ షాలు అనే యువకుడు కత్తితో గొంతు కోసి దారుణంగా హత్య చేశాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి నిందితుడిని అప్పటి సీఐ టి.వి.సత్యనారాయణ తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు. ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి జీవితఖైదు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ కడపలోని జిల్లా కోర్టులో జిల్లా జడ్జి జి.శ్రీదేవి తీర్పు చెప్పారు. నేరం రుజువు చేసేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు డి.ప్రతాప్‌కుమార్‌రెడ్డి, వి.సుబ్బలక్షుమ్మతోపాటు, సీఐ బి.రామకృష్ణ, సిబ్బంది తమ వంతుగా కృషి చేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న బియ్యం లారీ

మైదుకూరు : అక్రమంగా తరలిస్తున్న 26 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని మైదుకూరులో శుక్రవారం ఉదయం పౌరసరఫరాల సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. మైదుకూరు అర్బన్ ఎస్ఐ సుబ్బారావు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జమ్మలమడుగు నుంచి పెద్దముడియం మండలం గుండ్లగుంటకు చెందిన కామేశ్వర్‌రెడ్డికి చెందిన లారీలో బియ్యాన్ని తరలిస్తుండగా.. పౌరసరఫరాల సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ బద్వేలు డివిజన్ డిప్యూటీ తహసీల్దార్ సంపతి శివకుమార్, సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. లారీలో 520 బస్తాల మేరకు రూ.11 లక్షల విలువైన 26 టన్నుల రేషన్ బియ్యం ఉన్నాయి. లారీతోపాటు లారీ డ్రైవర్లు షేక్ గైబుసాబ్, షేక్ బాషాలను అదుపులోకి తీసుకున్నారు. సంబంధిత బియ్యాన్ని మైదుకూరు పౌరసరఫరాల గోదాం డిప్యూటీ తహసీల్దార్ సుశీలకు అప్పగించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ శివకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ ఎస్ఐ సుబ్బారావు పేర్కొన్నారు.

ఆవులను తప్పించబోయి.. కొండను ఢీకొట్టి..

108 వాహన డ్రైవర్ మృతి



మృతి చెందిన రమేష్‌బాబు

రామాపురం/బ్రహ్మంగారిమఠం : ఆవులను తప్పించబోయి కొండను ఢీకొట్టడంతో 108 వాహన డ్రైవర్ మృతి చెందాడు. రామాపురం ఎస్ఐ వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. బ్రహ్మంగారిమఠానికి చెందిన ఎస్.రమేష్‌బాబు(35) రామాపురం మండలంలో 108 వాహన డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఆ వాహనానికి కడపలో మరమ్మతులు చేయించుకుని గురువారం రాత్రి తిరిగి ములకలచెరువుకు పయనమయ్యాడు. కర్నూలు– చిత్తూరు జాతీయ రహదారిలోని రామాపురం మండలం గువ్వలచెరువు ఘాట్‌రోడ్డులో రెండో మలుపు వద్ద ఆవులు అడ్డం రావడంతో.. వాటిని తప్పించబోయి పక్కనే ఉన్న డివైడర్, కొండను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలయ్యాడు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కడప రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్నా పరిస్థితి విషమించడంతో శుక్రవారం మృతి చెందాడు. రమేష్ బ్రహ్మంగారిమఠం మండలం మల్లేపల్లె ఎస్సీ కాలనీలో రెండేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. ఆయనకు భార్య, ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని శవపరీక్ష అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విచారణ

కడప అర్బన్ : 108 వాహన డ్రైవర్ రమేష్ మృతి సంఘటనపై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ యాదవ్ ఆరా తీశారు. మృతుడి భార్య అనూషతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. కాగా ఈ సంఘటనపై పూర్తి వివరాలు అందజేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.

పులి కాదు హైనా

- అప్రమత్తత అవసరం
- డీఆర్ఓ శ్రీనివాసులు





పాద ముద్రలను పరిశీలిస్తున్న అటవీ శాఖ అధికారులు (ఇన్‌సెట్) లింగాల ఎస్సీ కాలనీలో హైనా పాద ముద్రలు

లింగాల : మండలంలో సంచరించినది పులి కాదు హైనా అని డిప్యూటీ రేంజ్ ఆఫీసర్(డీఆర్ఓ) శ్రీనివాసులు పేర్కొన్నారు. లింగాలలోని ఎస్సీ కాలనీలో శుక్రవారం ఉదయం పులి కనిపించిందని స్థానికులు భయాందోళనకు గురయ్యారు. దాని అడుగులు చెదిరిపోకుండా వారు చూశారు. 10 గంటల సమయంలో డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు మహబూబ్ బాషా, గోపాలకృష్ణ అక్కడికి చేరుకుని అడుగులు పరిశీలించారు. ఇవి పులివి కాదని, హైనా అడుగులు అని గుర్తించారు. పులి అడుగులలో గోర్ల ముద్రలు ఉండవని, అడుగులు పెద్దగా ఉంటాయని వారు కాలనీ వాసులకు వివరించారు. హైనాలు మేకలు, గొర్రెలపైన దాడి చేయవచ్చునన్నారు. కావున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కాలనీ ప్రదేశంలో భారీగా పెరిగిన కంప చెట్లు తొలగించుకోవాలని పేర్కొన్నారు. అదే విధంగా శుక్రవారం సాయంత్రం కర్ణపాపాయపల్లె గ్రామ సమీపంలోని నిత్య పూజకోనలో పులి కనిపించిందని గొర్రెల కాపరులు తెలియజేయడంతో అటవీ శాఖ అధికారులు వెళ్లి గాలింపు చర్యలు చేపట్టారు. అక్కడ ఎలాంటి ఆధారాలు కనిపించలేదని వారు పేర్కొన్నారు. మూడు రోజుల క్రితం తాతిరెడ్డిపల్లె పొలాల్లో కూడా ఎలాంటి ఆధారాలు కనిపించలేదన్నారు. తాము వివిధ అడవి జంతువుల పాద ముద్రలను ప్రజలకు వాట్సాప్ ద్వారా పంపడం జరిగిందని, వాటి ఆధారంగా ఏ రకం జంతువో గుర్తుపట్టవచ్చునని పేర్కొన్నారు. వివిధ రకాల మాంసాహార జంతువులు సంచరిస్తున్నాయని గొర్రెల కాపరులు, రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పులులు దట్టమైన అడవులలో ఆవాసాలను ఏర్పాటు చేసుకుంటాయన్నారు. అవి ఆ ఆవాసాలను వదిలి బయటకు రావన్నారు. అటవీ శాఖ అధికారుల వెంట వీఆర్ఓ నారాయణ, వీఆర్ఏలు ఉన్నారు.

వ్యక్తి దారుణ హత్య



యోగాంజనేయులు మృతదేహం

చక్రాయపేట : మండలంలోని గండికోవూరు గ్రామం దళితవాడకు చెందిన దండు యోగాంజనేయులు (36) శుక్రవారం సాయంత్రం దారుణ హత్యకు గురయ్యాడు. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యోగాంజనేయులు, నల్ల కదిరిగాళ్ల నాగార్జున మురుగు నీటి విషయమై గొడవపడ్డారు. ఈ సందర్భంలో నాగార్జున కట్టెతో యోగాంజనేయులును బలంగా కొట్టడంతో కింద పడ్డాడు. అతన్ని కుటుంబీకులు వెంటనే చికిత్స నిమిత్తం వేంపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అప్పటికే యోగాంజనేయులు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు. మృతదేహానికి శనివారం పోస్టుమార్టం నిర్వహించి, కేసు నమోదు చేస్తామని ఆయన పేర్కొన్నారు

పెన్నాలో యువకుడి గల్లంతు



యోహాన్ (ఫైల్)

వల్లూరు (చెన్నూరు) : మండల పరిధిలోని వాటర్ గండి వద్ద పెన్నా నదిలో నీటిలో ఓ యువకుడు గల్లంతయ్యాడు. చెన్నూరు మండలం ఓబులంపల్లె పంచాయతీ పరిధిలోని వాటర్ గండికి శుక్రవారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో కడప నగరం చిన్నచౌక్ అశోక్ నగర్‌కు చెందిన దాట్ల యోహాన్ (30) విహారయాత్రకు వచ్చారు. సాయంత్రం 4.30 ప్రాంతంలో ఈత కొడుతూ పెన్నా నదిలో గల్లంతు అయ్యాడు. విషయం తెలిసిన వెంటనే సీఐ పురుషోత్తంరాజు, సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ లభించలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ నాయకుల దాడి



గాయపడ్డ సుబ్బరాయుడు

పెండ్లిమర్రి : మండలంలోని గోపరాజుపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నంద్యాల సుబ్బరాయుడుపై అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శుక్రవారం రాత్రి రాళ్లు, కట్టెలతో దాడి చేశారు. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సుబ్బరాయుడు వైఎస్సార్‌సీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటున్నాడు. ఈ విషయాన్ని కొందరు టీడీపీ నాయకులు ఓర్వలేకపోయారు. రాత్రి అతను నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం వద్ద నుంచి ఊరి బయటకు వెళ్తుండగా గమనించి.. గోపాల్, గంగరాజు, మస్తాన్, మరికొందరు రాళ్లు, కట్టెలతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. గతంలో కూడా ఇతనిపై టీడీపీ నాయకులు మచ్చుకత్తితో దాడి చేసి గాయపరిచారు.

జనవరి 8 నుంచి ఎస్ఎఫ్ఐ మహాసభలు



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప నగరంలో 2025 జనవరి 8,9,10 తేదీల్లో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు నిర్వహించనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రవి పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు, మేధావులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజశేఖర్‌రెడ్డి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో పాలవ్యాపారి

కడప అర్బన్ : కడప నగరంలోని పాతకడపకు చెందిన పాలవ్యాపారిని రిమ్స్ పీఎస్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు సమాచారం. ఇతను రామాంజనేయపురానికి చెందిన ఓ మహిళకు, కాగితాలపెంటకు చెందిన ఓ మహిళకు ప్రతి రోజు పాలు పోస్తుంటాడు. శుక్రవారం రామాంజనేయపురంలో పాలు పోస్తూ ఫొటో తీస్తుండగా.. చూసిన మహిళ అభ్యంతరం వ్యక్తం చేసింది. తరువాత కడపలోని సైబర్‌క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. రిమ్స్ పీఎస్ పోలీసులు పాల వ్యాపారిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

హోంగార్డుల సేవలు అభినందనీయం





మాట్లాడుతున్న జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు, శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న హోంగార్డులు

- అదనపు ఎస్పీ కె.ప్రకాష్‌బాబు
- ఘనంగా హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం

కడప అర్బన్ : పోలీసులతో సమానంగా విధులు నిర్వర్తిస్తూ అందరి మన్ననలు చూరగొంటున్న హోంగార్డుల సేవలు అభినందనీయమని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు కొనియాడారు. కడప నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శుక్రవారం 62వ హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఆదేశాల మేరకు అదనపు ఎస్పీ (అడ్మిన్) కె. ప్రకాష్‌బాబు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా హోంగార్డుల పరేడ్‌ను పరిశీలించి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం అదనపు ఎస్పీ (అడ్మిన్) మాట్లాడుతూ హోంగార్డ్స్ వ్యవస్థ ఆవిర్భావ నేపథ్యాన్ని వివరించారు. జిల్లాలోని పోలీసు, అగ్నిమాపక, ఆర్టీఓ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, జైళ్లు, విజిలెన్స్ తదితర శాఖల్లో హోంగార్డులు విధులు నిర్వర్తిస్తూ వెన్నెముకగా నిలిచారని పేర్కొన్నారు. ఏఆర్ అదనపు ఎస్పీ బి.రమణయ్య మాట్లాడుతూ హోంగార్డుల సంక్షేమానికి జిల్లా పోలీసు యంత్రాంగం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. అనంతరం విధుల్లో ఉత్తమ పనితీరు కనపరిచిన హోంగార్డులు, క్రీడాపోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. పరేడ్ అనంతరం పరేడ్ గ్రౌండ్ నుంచి హోంగార్డుల శాంతి ర్యాలీని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్‌బాబు జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీ ఎన్టీఆర్ సర్కిల్, ఏడు రోడ్లు, పాతరిమ్స్, క్రిస్టియన్ సర్కిళ్ల మీదుగా పరేడ్ గ్రౌండ్‌కు చేరుకుంది. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ మురళీధర్, కడప డీఎస్పీ ఎ.వెంకటేశ్వర్లు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ రెడ్డెప్ప, డీపీఓ ఏఓ జ్యోతి, పోలీస్ వెల్ఫేర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ మేరీ సుజాత, ఆర్ఐలు ఆనంద్, శ్రీశైలరెడ్డి, టైటస్, వీరేష్, నగరంలోని సీఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దూలం సురేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉప్పు శంకర్, హోంగార్డులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయి?



మాట్లాడుతున్న కడప మేయర్ సురేష్‌బాబు

సిద్దవటం : 'ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఏమయ్యాయి చంద్రబాబు' అని కడప నగర మేయర్ సురేష్‌బాబు ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చి 6 నెలలు కావస్తున్నా అమలు చేయలేదని విమర్శించారు. సిద్దవటం మండలంలోని మూలపల్లె గ్రామంలో ఓ కార్యక్రమానికి శుక్రవారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. ప్రజలను మోసగించిన చంద్రబాబుకు బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

10న సర్టిఫికెట్ల పరిశీలన

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో అప్రెంటీస్ కోసం గత నెల 5 నుంచి 19 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న జిల్లా ఐటీఐ అభ్యర్థులు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం ఈ నెల 10న కర్నూలులోని జోనల్ ట్రైనింగ్ కాలేజీలో తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని కడప ఆర్టీసీ ఆర్ఎం పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. 10వ తరగతి, ఐటీఐ, ఎన్‌సీవీటీ సర్టిఫికెట్లు, ఎస్సీ, ఎస్టీ,బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణపత్రం, వికలాంగులయితే అందుకు సంబంధించిన ధ్రువీకరణపత్రం, పాన్‌కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, బ్యాంకు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఒక సెట్ జిరాక్స్ కాపీలతో వెరిఫికేషన్ ఫీజు కోసం రూ.118 తీసుకుని హాజరు కావాలన్నారు. డీజిల్ మెకానిక్ ట్రేడ్ వారికి ఆ రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 వరకు, మోటారు మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, మెషినిస్టు, ఫిట్టర్, డ్రాఫ్ట్‌మెన్ అభ్యర్థులకు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు మాత్రమే హాజరు కావాలన్నారు. ఏదైనా సమాచారం కోసం 08518-57025 నంబరులో కార్యాలయ పని వేళల్లో సంప్రదించాలని వివరించారు.